

చైర్మన్ పీఠంపైనే
ప్రధాన పార్టీల కన్ను..


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103




సంపుటి - 2 సంచిక - 282 శుక్రవారం 6 ఫిబ్రవరి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts


## వికసిత్ భారత్ లక్ష్యం దిశగా
# దేశం పరుగులు

- రీఫార్మ్.. పెర్ఫార్మ్.. ట్రాన్స్‌ఫార్మ్ దిశగా భారత్
- ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోంది
- 9 దేశాలతో ట్రేడ్ డీల్ చేసుకుంటున్నాం
- ఎక్స్‌ప్రెస్ వేగంతో సంస్కరణల అమలు
- దేశ ప్రగతి సాధనలో వెనకడుగు వేసేది లేదు
- మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ స్థానం
- కాంగ్రెస్‌కు దూరదృష్టి లేదు..ఓట్ బ్యాంక్ రాజకీయాలు
- రాష్ట్రపతి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో మోడీ
- విపక్షాల నిరసనుల...నినాదాలు..చివరకు వాకౌట్



**న్యూఢిల్లీ,/ఫిబ్రవరి 5 (జర్నలిస్ట్ వార్త):**వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశం ప్రస్తుతం దూసుకెళుతోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రస్తుతం అన్ని జీవిత పార్శ్వాల్లో, వర్గాల్లో మార్పులు కనిపిస్తున్నా యని అన్నారు. సరైన దిశలో దేశం ముందుకు సాగుతోందని అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బ్జడెట్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోదీ రాజ్యసభలో ప్రసంగించారు. విపక్ష నేతల నిరసనలు, నినాదాల నడుమ ప్రధాని ప్రసంగించారు. ఆ తరువాత కొద్ది సేపటికే విపక్షాలు వాకౌట్ చేశాయి. అయితే, ప్రధాని మాత్రం తన ప్రసంగాన్ని కొనసాగించారు. స్వాతంత్య్రం తొలి నాళ్లల్లో మిగతా2లో...

## ప్రజాపాలన అందిస్తుంటే
# విషం చిమ్ముతున్నారు

- ఓ కుటుంబం మొత్తం ప్రభుత్వం పడిపోవాలని చూస్తోంది
- అభివృద్ధి పనులకు రెండేళ్లలో రూ.17,442 కోట్లు ఖర్చు చేశాం
- ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఇచ్చిన ఘనత సోనియమ్మది
- పదేళ్లలో బిఆర్ఎస్ పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు
- బిజెపి అధ్యక్షుడు పాలమూరుకు వచ్చి హామీలపై మాట్లాడలేదు
- బిజెపికి ఈ ఎన్నికల్లో ఒక్కసీటు కూడా రాకుండా చేస్తాం
- కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో సిఎం రేవంత్
- పార్టీ అభ్యర్థులు క్షేత్రస్థాయిలో కలసి పనిచేయాలని హితవు



**కరీంనగర్ /ఫిబ్రవరి 5 (జర్నలిస్ట్ వార్త):**)ప్రజా ప్రభుత్వం ఏర్పడి ప్రజాపాలన అందిస్తుంటే కొందరు విషం చిమ్ముతున్నారని సిఎం రేవంత్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోవాలని కుటుంబం మొత్తం దాడికి దిగుతోందని పరోక్షంగా కెసిఆర్ కుటుంబంపై ఆరోపణలు చేశారు. తెలంగాణలో 123 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లలో అభివృద్ధి పనులకు రెండేళ్లలో రూ.17,442 కోట్లు ఖర్చు చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా గుమ్లాపూర్‌లో పర్యటించిన సీఎం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గుమ్లాపూర్‌లో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. తెలంగాణ ఏర్పాటు చేస్తామని సోనియాగాంధీ కరీంనగర్ గడ్డపై నుంచి మాట ఇచ్చారు. ఏపీలో పార్టీ అధికారం కోల్పోయినా మాట తప్పకుండా తెలంగాణ ఇచ్చారు. తెలంగాణను కాంగ్రెస్ ఇచ్చినా.. బీఆర్ఎస్‌కు మిగతా2లో...

## మేడారంలో అత్యాచారం
# ఘటన అబద్ధం

- తేల్చి చెప్పిన జాతీయ మహిళా కమిషన్



**ములుగు,/ఫిబ్రవరి 5 (జర్నలిస్ట్ వార్త):** మేడారం జాతరలో బాలికపై సామూహిక అత్యాచారం జరగలేదని జాతీయ మహిళా కమిషన్ ఎంక్వయిరీ మిగతా2లో...

## భగవంతుడిపైనా పగబట్టిన
# వైసిపి

- వైసిపి హయాంలో వరుసబెట్టి హిందుత్వంపై దాడులు
- ఆలయాలు ధ్వంసం...రథం దగ్ధం...ఆభరణాల చోరీ
- సిట్ నివేదికలో వైసిపికి ఎక్కడా క్లీన్‌చిట్ ఇవ్వలేదు
- మీడియా సమావేశంలో పవన్ కళ్యాణ్ ఆగ్రహం



**అమరావతి, /ఫిబ్రవరి 5 (జర్నలిస్ట్ వార్త):** తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ విషయంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సున్నిత అంశాలపై చాలా ఆలోచించి మాట్లాడాలని తెలిపారు. సిట్ నివేదికను సీఎం చంద్రబాబు తమకు చదివి వినిపించారని ప్రస్తావించారు. జంతువుల కొవ్వు మిగతా2లో...

## మేఘాలయలో
# అక్రమ బొగ్గు తవ్వకాలు

- పేలుడు ఘటనలో 16మంది దుర్మరణం



2లో

## అందుబాటులోకి
# భారత్ ట్యాక్సీ

- యాప్‌ను ప్రారంభించిన అమిత్ షా



2లో

## పదేళ్ల బిఆర్ఎస్ అభివృద్ధి...
# రెండేళ్ల కాంగ్రెస్ దోఖా పనులు

- తులం బంగారం వచ్చినోళ్లు కాంగ్రెస్‌కు ఓటేయండి
- సిరిసిల్ల ప్రచారంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**రాజన్న సిరిసిల//ఫిబ్రవరి 5 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రధాన పార్టీలకు చెందిన కీలక నేతలు ప్రచారంలో ఫుల్ బిజీగా ఉన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం బివైనగర్ లో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత కేటీఆర్ పాల్గొన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే సిరిసిల్ల జిల్లాను తీసేస్తారని మిగతా2లో...

## పన్నెండేళ్లుగా తెలంగాణలో
# బానిస ప్రభుత్వాలు

- పదేళ్ల బిఆర్ఎస్,రెండేళ్ల కాంగ్రెస్‌తో ఒరిగింది శూన్యం
- మజ్లిస్ కనుసన్నల్లోనే రెండు ప్రభుత్వాల పాలన
- మద్యం ఆదాయం..భూముల అమ్మకం ఇదే పాలసీనా
- రేవంత్ సర్కార్‌పై ఘాటు విమర్శలు చేసిన కిషన్ రెడ్డి



**హైదరాబాద్,/ఫిబ్రవరి 5 (జర్నలిస్ట్ వార్త):**తెలంగాణను రక్షించుకోవా లంటే బీజేపీకి ఓటు వేయాలని ప్రజలకు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి సూచించారు. పన్నెండు ఏళ్లుగా తెలంగాణలో బానిస ప్రభుత్వాలు నడుపుతున్నారని విమర్శించారు. మజ్లిస్ కనుసన్నల్లో బీఆర్ఎస్ పదేళ్లు బానిస పాలన చేస్తే.. కాంగ్రెస్ పార్టీ సైతం మజ్లిస్ ఓట్ల కోసం బానిస పాలన చేస్తుందంటూ మండిపడ్డారు. గురువారం హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మిగతా2లో...



## గ్రూప్-1 ఉద్యోగులకు
# ఊరట

- సింగిల్ బెంచ్ తీర్పును రద్దు చేసిన ధర్మాసనం

**హైదరాబాద్,ఫిబ్రవరి 5 :** గ్రూప్ 1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టు ఊరట కల్పించింది. గ్రూప్ 1 నియామకాల వ్యవహారంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును రద్దు మిగతా2లో

## బిజెపిని గెలిపిస్తే
# దండిగా నిధులు

## - ప్రచారంలో హామీలు గుప్పించిన బండి



2లో

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..



# వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశం పరుగులు

(మొదటి పేజీ తరువాయి)

భారత్ ప్రపంచంలో 6వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండేదని అన్నారు. కానీ, మునుపటి ప్రభుత్వాల విధానాల కారణంగా 2014 నాటికి 11వ స్థానికి పడిపోయిందని అన్నారు. ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోందని అన్నారు. ఈయూ సహా 27 దేశాలతో భారత్ అనేక ఒప్పందాలు చేసుకుందని గుర్తు చేశారు. 9 దేశాలతో ట్రేడ్ డీల్ చేసుకుంటున్నామని చెప్పారు. రీఫార్మ్.. పెర్ఫార్మ్.. ట్రాన్స్‌ఫార్మ్ దిశగా భారత్ సాగుతోందని అన్నారు. ఉత్పత్తి రంగంలో అనేక విజయాలు సాధించామని చెప్పారు. ఎక్స్‌ప్రెస్ వేగంతో సంస్కరణలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. భారత్‌లో ప్రతిభావంతమైన యువతకు కొరత లేదని వ్యాఖ్యానించారు. రానున్న 25 ఏళ్లు భారత్‌కు అత్యంక కీలకమని వ్యాఖ్యానించారు. దేశ ప్రగతి సాధనలో వెనకడుగు వేసేది లేదని కూడా తేల్చి చెప్పారు. ఒకప్పుడు భారత్ బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉండేదని అన్నారు. ప్రస్తుతం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతోందని చెప్పారు. ప్రపంచ సవాళ్లకు భారత్ పరిష్కారాలు చూపించే స్థితిలో నిలిచి ఒక ఆశాకిరణంగా మారిందని అన్నారు. అధిక వృద్ధి రేటు, తక్కువ ద్రవ్యోల్బణం కలగలిసిన అరుదైన స్థితిలో భారత్ ఉందని అన్నారు. మునుపటి ప్రభుత్వాల తప్పులను సరిచేసేందుకే అధిక శాతం తమ శక్తియుక్తులను వినియోగించాల్సి వస్తోందని అన్నారు. గత ప్రభుత్వాల కారణంగా మూటగట్టుకున్న ప్రతికూల అభిప్రాయాన్ని తొలగించుకుంటున్నామని అన్నారు. ఈ నష్టాన్ని సరిచేసేలా భవిష్యత్తుకు తగిన విధానాలతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. గ్లోబల్ సౌత్‌గా పేరు పడ్డ దేశాల తరఫున భారత్ అంతర్జాతీయ వేదికలపై బలంగా తన వాణిని వినిపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచదేశాలకు విశ్వసనీయ భాగస్వామిగా భారత్ అవతరించిందని చెప్పారు. కాంగ్రెస్‌కు దార్శనికత లేదని విమర్శించారు. ఫలితంగా భారత్ చాలా కాలం పాటు కష్టాలు పడిందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా వ్యవస్థలు బలహీనపడతాయని అన్నారు. ప్రపంచంలో అగ్రగామి దేశాలు భారత్‌తో వాణిజ్య ఒప్పందాల కోసం ఉత్సుకతతో ఉన్నాయని చెప్పారు. ఈయూ ట్రేడ్ డీల్‌తో ప్రపంచంలో స్థిరత్వంపై వివిధ దేశాలకు నమ్మకం పెరిగిందని అన్నారు. అమెరికాతో ఒప్పందంతో ఈ భావన మరింత బలపడిందని వ్యాఖ్యానించారు. ఇకపోతే కాంగ్రెస్‌పై ప్రధాని మోదీతీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీకి దూరదృష్టి, ఎటువంటి ప్రణాళిక లేదన్నారు. తనతోపాటు ఓ వర్గంపైనా ద్వేషాన్ని పెంచుకుంటోం దన్నారు. ఇటీవల లోక్‌సభలో చోటుచేసుకున్న పరిణామాలు తనను తీవ్రంగా బాధించాయన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ప్రసంగించిన ప్రధాని మోదీ..

# ప్రజాపాలన అందిస్తుంటే విషం చిమ్ముతున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు పట్టం కట్టారు. ప్రజా తీర్పును కాంగ్రెస్ పార్టీ శిరసావహించింది. పదేళ్లలో పన్నుల రూపంలో రూ.20లక్షల కోట్లు ప్రజలు ప్రభుత్వానికి కట్టారు. కానీ, పదేళ్లలో పేదలకు రెండు పడక గదుల ఇళ్లు కూడా కట్టించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో మున్సిపల్ ఎన్నికలు వచ్చాయి.పాలమూరు జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి భాజపా జాతీయ అధ్యక్షుడిని తీసుకొచ్చారు. కాళేశ్వరం, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వలేదు, మెట్రో రైలు మంజూరు చేయలేదు..మూసీకి నిధులు ఇవ్వలేదు. రీజినల్ రింగ్‌రోడ్డు పూర్తి చేస్తామని చెప్పలేదు. ఇవేమీ ఇవ్వకుండా భాజపా జాతీయ అధ్యక్షుడిని ఎందుకు తీసుకొచ్చారని ప్రశ్నించారు. దేశంలోని భాజపా అగ్రనేతలందరినీ ఎన్నికల ప్రచారానికి తీసుకొచ్చినా ఒక్క మున్సిపాలిటీ అయినా గెలుస్తారా? కాంగ్రెస్ సత్తా ఏంటో భాజపాకు చూపిస్తాం అని రేవంత్ అన్నారు. భాజపా, బీఆర్ఎస్ బంధం ఫెవికాల్ బంధం కాదా?. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవదానం చేసింది. ఓట్లు, సీట్లు దానం చేసి 8 చోట్ల భాజపా ఎంపీలను గెలిపించారు. 8 చోట్ల డిపాజిట్లు కోల్పోయినా తామే గెలుస్తామని బీఆర్ఎస్ రంకెలేస్తోంది. బీఆర్ఎస్ రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం..మూడేళ్లలోనూ కూలేశ్వరం అయింది. కాళేశ్వరాన్ని బీఆర్ఎస్ ఏటీఎంలా వాడుకుందని మోదీ, అమిత్ షా స్వయంగా చెప్పారు. కానీ, కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిస్తే.. ఇప్పటి వరకు కేంద్రం స్పందించలేదు. దీనిపై కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు. రాజకీయాల్లో డబ్బులతో కాదు.. నమ్మకంతోనే గెలుస్తామని మున్సిపల్ ఎన్నికల బరిలో దిగిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. 'ప్రజలకు నమ్మకం కలిగించండి.. అదొక్కటే మిమ్మల్ని గెలిపిస్తుంది' అని వారికి స్పష్టం చేశారు. గురువారం నాడు కరీంనగర్‌లో మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారితో ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. ఇవి కార్యకర్తల ఎన్నికలని తెలిపారు. కార్యకర్తలకు సముచిత స్థానం ఇచ్చినప్పుడే పార్టీ బలపడుతుందని పేర్కొన్నారు. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని నేతలకు ఆయన సూచించారు. అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లల్లో ఎన్నో సంక్షేమ పథకాలను అందించామని.. ఇంకా చేయాల్సింది ఎంతో ఉందన్నారు రేవంత్ రెడ్డి. అయితే అధికార పార్టీలో టికెట్ ఆశించే వాళ్లు ఎక్కువగా ఉండటం సహజమని.. ఎంతో మంది పోటీ పడ్డా.. కాంగ్రెస్ పార్టీ బీఫామ్ దక్కడం మీ అదృష్టమని అభ్యర్థులకు సోదాహరణగా వివరించారు. ఒక్క ఓటు.. గెలుపు ఓటములను నిర్ణయిస్తుందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. టికెట్ రాని వారిని కూడా సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలంటూ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థలకు దిశానిర్దేశర చేశారు ముఖ్యమంత్రి. పదేళ్ల పాలనలో గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకపోయినా మన ప్రభుత్వంలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందించామని చెప్పుకొచ్చారు. పేదలకు సన్న బియ్యం.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామని వివరించారు. మహిళా గ్రూపులకు సున్నా వడ్డీ రుణాలు అందించామని పేర్కొన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించామన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలతోపాటు వాటి వల్ల చేకూరిన లబ్దిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని మున్సిపల్ అభ్యర్థులకు స్పష్టం చేశారు.

# భగవంతుడిపైనా పగబట్టిన వైసిపి

(మొదటి పేజీ తరువాయి)

కలిసిందని చెప్పడం చాలా సున్నిత అంశమని పేర్కొన్నారు. మాట్లాడేటప్పుడు పర్యవసానాలు ఆలోచించే ముందుకెళ్తామని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు నివాసంలో భేటీ అనంతరం పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లు తామే అధికారంలో ఉంటామని.. రాజకీయ లబ్ది కోసం మాట్లాడాల్సిన అవసరం ఏముందని పవన్ ప్రశ్నించారు. భగవంతుడిపైనా వైసీపీ పగబట్టిందని ధ్వజమెత్తారు. అందరం ఏడు కొండలు అంటామని.. వైసీపీ వాళ్లు రెండు కొండలు అంటారని అన్నారు. వైసీపీ హయాంలో హిందూ మతంపై చాలా దాడులు జరిగాయని ఆరోపణలు చేశారు. రామతీర్థంలో శ్రీరామచంద్రుడి విగ్రహం ధ్వంసం చేశారని ఫైర్ అయ్యారు. దుర్గమ్మ ఆలయంలో చోరీ జరిగితే.. ఇవి పోతే ఇంకొకటి కొందామన్నారని చెప్పుకొచ్చారు. అంతర్వేదిలో రథం కాలిపోతే ఎవరో పిచ్చివారు చేశారని చెప్పారన్నారు. నెయ్యి కల్తీ అంశంలో మతాల ప్రస్తావన లేదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. 'తప్పు చేసి క్షమాపణ అడగకుండా మమ్మల్నే క్షమాపణ అడుగుతున్నారు. శ్రీవారి విషయంలో తప్పుచేసిన వారు నాశనమైపోతారు. సిట్ రిపోర్ట్ ఎక్కడా వైసీపీకి క్లీన్‌చిట్ ఇవ్వలేదన్నారు. రిపోర్ట్‌లో జంతువుల కొవ్వు ఉందని స్పష్టంగా ఉంది. భగవంతుడితో పెట్టుకున్నవారు సర్వనాశనం అయిపోతారు తప్ప బతికున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా చేసిన మహాపాపానికి దేవుడిని క్షమాపణ కోరుకోవాలి. భగవంతుడికి మొకరిల్లే వరకూ విషయాన్ని వదిలిపెట్టం. హిందూ ధర్మాన్ని కాపాడే విషయంలో చాలా స్పష్టంగా ఉన్నాం. కల్తీ లడ్డూ వ్యవహారం ముమ్మాటికీ తెలిసి చేసిన నేరం. 2022లోనే కల్తీ నిర్ధారణ అయ్యింది. అయినా అయోధ్యకు అవే కల్తీ లడ్డూలు పంపి మహాపాపానికి ఒడిగట్టారు' అని పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. కల్తీ లడ్డూ వ్యవహారంలో కళ్ల ముందు ఎన్నో వాస్తవాలు కనిపిస్తుంటే మాట్లాడకపోవటం సబబు కాదని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 'అన్ని నివేదికలు.. ప్రసాదంలో వాడిన పదార్థాల్లో నెయ్యి లేదని నిర్ధారించాయి. ఎన్డీడీబీ జంతుకొవ్వు అవశేషాలు నిర్ధారిస్తే, తమ వద్ద అలాంటి పరీక్ష చేసే సామర్థ్యం లేదని ఎన్డీఆర్ఐ చెప్పింది. ప్రతీమాట భక్తుల మనోభావాలు, సెంటిమెంటును దృష్టిలో పెట్టుకునే మాట్లాడుతున్నాం. దేవుడి విషయాన్ని రాజకీయం చేయకూడదనే నిష్ఠతో వ్యవహరిస్తూ వస్తున్నాం. ప్రజలకు వాస్తవాలు చెప్పకుంటే అది ఇంకా పెద్ద తప్పు అవుతుందనే నిజాలు బయటపెడుతున్నాం. వైసీపీ హయాంలో పెద్దఎత్తున దేవాలయాలపై దాడులు జరిగితే ఎలాంటి చర్యలు తీసుకోలేదు' అని పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పదేళ్ల బిఆర్ఎస్ అభివృద్ధి... రెండేళ్ల కాంగ్రెస్ దోఖా పనులు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన విమర్శించారు. 'ఓవైపు అభివృద్ధి చేసిన బీఆర్ఎస్, మరోవైపు ఇచ్చిన హామీలు మరచిన కాంగ్రెస్, ఎప్పుడో ఒకసారి దేవుని పేరు చెప్పుకుని వచ్చే బీజేపీ పార్టీలు ఉన్నాయి. ఎవరికి ఓటు వేయ్యాలో మీరే నిర్ణయించుకోవాలి' అని కేటీఆర్ అన్నారు.ఈ మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన పోటీ గత పదేళ్లలో ప్రజల కోసం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన బీఆర్ఎస్ పార్టీకి, గడిచిన రెండేళ్లలో ఉన్న సంక్షేమ పథకాలను ఎత్తివేసిన కాంగ్రెస్ పార్టీకి మధ్య ఉన్నదని కేటీఆర్ చెప్పారు. మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేస్తేనే తగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు తిరిగి ప్రారంభమవుతాయని, ఆ దిశగా ఈ మున్సిపల్ ఎన్నికలతోనే కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసుకునే కార్యక్రమం ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీని గనుక ఈ మున్సిపల్ ఎన్నికల్లో నిలదీయకుంటే, ఇచ్చిన హామీల మోసంపైన ప్రశ్నించకుంటే, మరో మూడు సంవత్సరాల దాకా అంటే శాసనసభ ఎన్నికల వరకు ప్రజలకి ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించే అధికారం, అవకాశం రాదని చెప్పారు. ఇప్పుడు గనుక ప్రభుత్వానికి ఒక హెచ్చరిక చేసేలా సురుకు పెట్టకుంటే కాంగ్రెస్ పార్టీ తన మోసాలను కొనసాగిస్తుందని అన్నారు. కాంగ్రెస్ వాళ్లు తులం బంగారం ఇస్తానన్నారు. కానీ, వాళ్లు ఉన్న పుస్తెలు ఎత్తుకు పోయే రకం. నాపై కోపంతో బతుకమ్మ చీరలు బంద్ చేశారు. నేతన్నల బతుకుదెరువుపై దెబ్బ కొట్టారు. దేవుని గుడి వద్ద ఉండి అడుక్కుతినేవారిలాగా, దేవుని పేరుతో ఓట్టడుక్కోవడానికి మాత్రమే బీజేపీ వారే వస్తారు. అలానే కాంగ్రెస్ కు ఓటేస్తే సిరిసిల్ల జిల్లాను తీసేస్తారు. తులం బంగారం వచ్చిన వారు కాంగ్రెస్ కు ఓటెయ్యండి, రానివారు బీఆర్ఎస్‌కు ఓటెయ్యండి. సిరిసిల్ల బతుకుదెరువు లేకుండా చేసినోడికి, గట్టి బుద్ధి చెప్పాలి' అని కేటీఆర్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక వార్డుల ప్రజలను, పట్టణ ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఇప్పటికే అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. మున్సిపల్ ఎన్నికల కోసం మరోసారి అబద్దాలు చెబుతోందని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మళ్లీ కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మి ఓటువేస్తే.. మళ్లీ మోసపోవడం ఖాయం' అని కేటీఆర్ అన్నారు.

## మేడారంలో అత్యాచారం ఘటన అబద్ధం

(మొదటి పేజీ తరువాయి)

కమిటీ తేల్చి చెప్పింది. గురువారం మధ్యాహ్నం జాతీయ మహిళా కమిషన్ సభ్యులు డెలినా, కంచన్ కట్టర్ ఆధ్వర్యంలో విచారణ కమిటీ ములుగుకు చేరుకుంది. అనంతరం స్థానిక కలెక్టరేట్ లో కలెక్టర్ దివాకరం, ఎస్పీ రామ్‌నాథ్ కేకన్‌తో కమిటీ సమావేశమైంది. ఆ తర్వాత గ్యాంగ్ రేప్‌పై విచారణ చేపట్టింది. అలాగే ఈ ఘటన జరిగిందంటూ ఆరోపిస్తున్న ప్రదేశాన్ని సైతం కమిటీ సభ్యులతోపాటు జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించారు. ఈ జాతరలో ఎలాంటి గ్యాంగ్ రేప్ ఘటన జరగలేదని సదరు కమిటీ ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చింది. దాంతో పోలీసుల నుంచి లిఖిత పూర్వక నివేదిక వచ్చాక.. జాతీయ మహిళా కమిషన్‌కు ఈ ఎంక్వయిరీ కమిటీ.. రిపోర్టును అందించనుంది. మేడారంలో జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు సమ్మక్క-సారలమ్మ జాతర జరిగింది. ఈ జాతరలో బాలికపై సామూహిక అత్యాచారం జరిగిందంటూ సోషల్ మీడియాలో వార్త వైరల్ అయింది. మామిడితోటలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పలువురు యువకులు వాష్ రూమ్‌కు వెళ్లిన బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు ప్రచారం జరిగింది. అనంతరం ఈ ఘటనకు కారణమైన యువకులు జంపన్నవాగు సమీపంలోని ఒక షాపులో దాక్కున్నారని.. వారిని పోలీసులు తీసుకువెళ్లినట్లు ఆ వార్త కథనంలో పేర్కొన్నారు.ఈ వార్తను ఇప్పటికే ములుగు ఎస్పీ రామ్‌నాథ్ సుధీర్ కేకర్ ఖండించారు. అలాంటి ఘటన ఏదీ చోటు చేసుకోలేదని స్పష్టం చేశారు. మరోవైపు ఈ ఘటనపై జాతీయ మహిళా కమిషన్ సీరియస్ అయింది. కమిషన్‌లోని సభ్యులతో విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ.. ములుగు వచ్చి వాస్తవ పరిస్థితులు పరిశీలించి.. కమిషన్‌కు నివేదిక అందజేయనుంది.

# మేఘాలయలో అక్రమ బొగ్గు తవ్వకాలు

- పేలుడు ఘటనలో 16మంది దుర్మరణం

**షిల్లాంగ్,/ఫిబ్రవరి 5 (జర్నలిస్ట్ వార్త):** మేఘాలయ రాష్ట్రంలో అక్రమ బొగ్గు తవ్వకాలు మరోసారి భారీ ప్రాణ నష్టానికి కారణమయ్యాయి. తూర్పు జైంతియా హిల్స్ జిల్లాలోని ఓ గనిలో బొగ్గు తవ్వుతుండగా భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు ధాటికి 16 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా.. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, రెస్క్యూ టీమ్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ గనిని అక్రమంగా నిర్వహిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే పేలుడికి గల కారణాలు మాత్రం ఇంకా తెలియరాలేదు. మేఘాలయలో ర్యాట్ హోల్ మైనింగ్, అశాస్త్రీయ పద్ధతుల్లో తవ్వకాలు జరుపుతున్నారు. అయితే, ఈ తవ్వకాలను 2014 నుంచి జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఔఉ÷) నిషేధించింది. ర్యాట్ హోల్ అంటే.. సమాంతరంగా సన్నని గుంత తవ్వుతూ బొగ్గును బయటకు వెలికి తీసే పద్ధతి. సుమారు 3, 4 అడుగుల వెడల్పుతో ఈ గుంతలు ఉంటాయి. అచ్చం ఎలుకలు బొరియలు తవ్వినట్టుగా ఉంటాయి కాబట్టి దీనికి 'ర్యాట్ హోల్ మైనింగ్' అనే పేరు వచ్చింది. ఇటీవల ఈ తవ్వకాలపై ఎన్జీటీ నిషేధాన్ని సుప్రీంకోర్టు కూడా సమర్థించింది.

# అందుబాటులోకి భారత్ ట్యాక్సీ

**న్యూఢిల్లీ,/ఫిబ్రవరి 5 (జర్నలిస్ట్ వార్త):**ప్రైవేటురంగ ట్యాక్సీ సంస్థలు ఓలా, ఉబర్, ర్యాపిడోకు పోటీగా కేంద్ర ప్రభుత్వం భారత్ ట్యాక్సీ పేరిట కొత్త యాప్‌ను తీసుకొచ్చింది. కేంద్రమంత్రి అమిత్ షా గురువారం ఈ యాప్‌ను ప్రారంభించారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన సేవలు విజయవంతమైన నేపథ్యంలో ఎట్టకేలకు అందుబాటులోకి తెచ్చారు. తొలుత దిల్లీ-రాజధాని ప్రాంతం, గుజరాత్ రాష్ట్రాల్లో సేవలు లభిస్తాయి. రాబోయే మూడేళ్లలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, ద్వారక నుంచి కామాఖ్య వరకు భారత్ ట్యాక్సీ సేవలను తీసుకొస్తామని అమిత్‌షా పేర్కొన్నారు. ఇందులో లాభాలు డ్రైవర్లకే వెళతాయని చెప్పారు. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా కార్లు, త్రీవీలర్లు, టూవీలర్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. దేశంలో క్యాబ్ బుకింగ్ సేవల్లో ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి సంస్థలు కీలక భూమిక పోషిస్తున్నాయి. డ్రైవర్ల నుంచి ఆయా సంస్థలు కొంతమొత్తం కమిషన్‌గా వసూలు చేస్తున్నాయి. వారి శ్రమను ఆయా కంపెనీలు దోచుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మల్టీ స్టేట్ కోపరేటివ్ సొసైటీస్ యాక్ట్ కింద 2025 జూన్ 5న 'భారత్ ట్యాక్సీ'కి కేంద్రం రూపకల్పన చేసింది. జీరో కమిషన్, సర్జ్‌ప్రైసింగ్ లేని విధానం, డ్రైవర్లకు లాభాలు పంచిపెట్టడం దీని ముఖ్య ఉద్దేశం. దిల్లీ-ఎన్‌సీఆర్, గుజరాత్‌లో డిసెంబర్ 2 నుంచి ప్రయోగాత్మకంగా సేవలందిస్తున్నారు. ఇప్పటి వరకు 3 లక్షల డ్రైవర్లు ఇందులో చేరగా.. లక్ష మంది యూజర్లు రిజిస్టర్ అయ్యారు. రోజుకు 10 వేల రైడ్లు జరిగాయి. సుమారు రూ.10 కోట్లను డ్రైవర్లకు లాభాలుగా అందించినట్లు కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ పేర్కొంది. డ్రైవర్లకు 'సారథి' పేరిట ఆరోగ్య, ప్రమాద బీమా, రిటైర్మెంట్ సేవింగ్స్ కూడా లభిస్తాయి.

# గ్రూప్-1 ఉద్యోగులకు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

చేస్తూ చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది. గతంలో.. గ్రూప్ 1 నియామకాలపై విచారణ చేపట్టిన సింగిల్ బెంచ్ ధర్మాసనం.. జనరల్ ర్యాంకింగ్ లిస్టును రద్దు చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. అలాగే మెయిన్స్ పరీక్ష జవాబు పత్రాలను పునః మూల్యాంకనం చేయాలని నాడు న్యాయమూర్తి ఆదేశించారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ టీజీపీఎస్సీతో పాటు ఇప్పటికే ఎంపికైన అభ్యర్థులు హైకోర్టులో పిల్ వేశారు.ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి.. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. తుది తీర్పునకు లోబడి గ్రూప్ 1 నియామకాలు చేపట్టవచ్చని ఇప్పటికే గతంలో ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. ఆ ఉత్తర్వుల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 562 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసింది.

# బిజెపిని గెలిపిస్తే దండిగా నిధులు

**కరీంనగర్,/ఫిబ్రవరి 5 (జర్నలిస్ట్ వార్త):**మున్సిపాలిటీల్లో బిజెపిని గెలిపిస్తే నిధుల వరద పారిస్తానని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. మున్సిపాలిటీలకు వచ్చేది కేంద్ర నిధులేనని అన్నారు. గ్రామ పంచాయతీలకు ఇప్పటికే కేంద్రం రూ.259 కోట్లు విడుదల చేసిందని, మున్సిపల్ ఎన్నికల్లో భాజపాని గెలిపిస్తే మొదటి విడతగా తెలంగాణకు రూ.500 కోట్లు తీసుకొస్తామని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. హుజూరాబాద్ సూపర్ బజార్ చౌరస్తాలో గురువారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కేంద్రం నుంచి అభివృద్ధి పనుల కోసం రూ.వందల కోట్లు తీసుకొచ్చాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని పరికరాలు తీసుకొస్తే రాష్ట్ర ప్రభుత్వం సరైన సిబ్బందిని నియమించట్లేదు. గత పదేళ్ల నుంచి హుజూరాబాద్ అభివృద్ధి చెందలేదు. కాంగ్రెస్‌గతంలో ఇచ్చిన హామీలు అమలు నెరవేర్చిందా? ఈ ప్రభుత్వం హుజూరాబాద్ మున్సిపల్ అభివృద్ధికి ఒక్కపైసా ఇవ్వలేదు. ఈ ఎన్నికల్లో భాజపాను గెలిపిస్తే ఇక్కడ మినీ స్టేడియం నిర్మిస్తాం. కాంగ్రెస్‌ను గెలిపిస్తే అన్ని ట్యాక్సులు పెంచుతారు. మేం దిల్లీ నుంచి నిధులు తీసుకొచ్చి హుజూరాబాద్‌ను అభివృద్ధి చేయిస్తామని కేంద్ర మంత్రి బండి అన్నారు.

# పన్నెండేళ్లుగా తెలంగాణాలో బానిస ప్రభుత్వాలు

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ..ప్రభుత్వ భూములను విక్రయించడం అభివృద్ధా? అంటూ ఈ రెండు పార్టీల నేతలను సూటిగా ప్రశ్నించారు. మద్యం, డ్రగ్స్‌తో కుటుంబాలు పతనం అవుతున్నా.. ఈ ప్రభుత్వానికి కావాల్సింది మాత్రం ఆర్థిక వనరులేనని కేంద్ర మంత్రి అన్నారు. భూములు అమ్మాలి.. అప్పులు చేయాలనేది కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచన అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజా ప్రభుత్వం కాదు.. అవినీతి, దోపిడి ప్రభుత్వమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అభివర్ణించారు. వీధి దీపాలు వెలిగించేందుకు డబ్బులు లేని దౌర్భాగ్య పరిస్థితిలో ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉందని వ్యంగ్యంగా అన్నారు. పని చేసే పార్టీలకే ఓటు వేయాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగస్తులకు ఐదు డీఏలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయంటూ కిషన్ రెడ్డి సోదాహరణగా వివరించారు. ఇదా ప్రజా ప్రభుత్వమా.. పని చేసే ప్రభుత్వమా? సమాధానం చెప్పాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. పని చేసే ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని ఆయన గుర్తు చేశారు. పొరుగునున్న ఆంధ్రప్రదేశ్‌లో అనేక విమానాశ్రయాలు ఉన్నాయని.. తెలంగాణలో ఎందుకు లేవని ఆయన రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీశారు. గత పదేళ్లు ఏమీ చేశారంటూ బీఆర్ఎస్ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం.. కాంగ్రెస్ పార్టీకి బంగారు బాతు అయిందన్నారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా.. ఇక్కడి నుంచే నగదు పంపుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగుల బెనిఫిట్స్ మాత్రం ఇవ్వరన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. ఆర్ఆర్ ట్యాక్స్‌తో వ్యాపారస్తులు భయపడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీలకు ఎంత నగదు ఇచ్చారో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని బల్లగుద్దీ మరి ప్రశ్నించారు. ఫిక్సడ్ రేట్స్.. వన్ టైమ్ పేమెంట్‌ను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పక్కగా కొనసాగిస్తుందని విమర్శించారు. గత 26 నెలల్లో ఏమీ చేసిందో చెప్పాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఇంటి అల్లుడి ఫోన్ ట్యాపింగ్ చేసిన దౌర్భాగ్య పరిస్థితి నెలకొందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏమీ పీకారని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బాషలో అడుగుతున్నా నన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచిన జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్ళారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గుర్తు చేశారు.

# సాయిపేటకు అభివృద్ధి హామీ

## గ్రామ సభలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి -6 నెలల్లో పంచాయతీ భవనం, డ్రైనేజీ పూర్తి చేస్తాం

**ధర్మసాగర్/ ఫిబ్రవరి5 హనుమకొండ బ్యూరో(జర్నలిస్ట్ వార్త);**ధర్మసాగర్ మండలం సాయిపేట గ్రామ పంచాయతీ భవనంలో నిర్వహించిన గ్రామ సభకు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. ఇతర కార్యక్రమాల నిమిత్తం వెళ్తున్న సమయంలో గ్రామ సభ జరుగుతున్న విషయం తెలుసుకుని సభలో పాల్గొనడం విశేషంగా మారింది. ఎమ్మెల్యే హాజరుతో గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొనగా, గ్రామస్తులు, స్థానిక సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ‌సర్పంచ్ ఎన్నికల అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న మొదటి గ్రామ సభలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గ్రామస్తుల ఏకాభిప్రాయం మేరకు ప్రాధాన్యత క్రమంలో




నిర్ణయించుకోవాలని సూచించారు.గ్రామ పంచాయతీ కార్యాలయం శిథిలావస్థలో ఉందని పేర్కొన్న ఎమ్మెల్యే, తక్షణమే నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం అవసరం అని అన్నారు. అలాగే గ్రామ ప్రధాన రహదారి వెంట డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, డ్రైనేజీ నిర్మాణాన్ని ప్రాధాన్యతగా చేపట్టాలని సూచించారు.
ఈ రెండు పనులకు సంబంధించి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ లక్ష్మి నాగరాజు గారికి ఆదేశించారు. ఆరు నెలల లోపే గ్రామ పంచాయతీ భవనం, డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేస్తానని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు.గ్రామంలో పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న విద్యుత్ సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లక్ష్మి నాగరాజు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# పేదింటి ఆడపడుచులకు ప్రభుత్వ భరోసా

## కల్యాణ లక్ష్మితో లక్షా 116 సాయం -లంచాలకు తావులేని పాలన లక్ష్యం : కడియం శ్రీహరి





**ధర్మసాగర్/, హనుమకొండ బ్యూరో ఫిబ్రవరి 5 (జర్నలిస్టు వార్త)::**పేద వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. పేదింటి ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా అందించే కల్యాణ లక్ష్మి పథకం తల్లిదండ్రులకు పెద్ద ఊరటగా నిలుస్తోందని అన్నారు.వేలేరు మండల కేంద్రం రైతు వేదికతో పాటు ధర్మసాగర్ మండల కేంద్రం రైతు వేదికలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మిషాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగావేలేరు మండలానికి చెందిన 26 మంది లబ్ధిదారులకు రూ.26,03,016,ధర్మసాగర్ మండలానికి చెందిన 69 మంది లబ్ధిదారులకు రూ.69,08,004, కాజీపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన 6 మంది లబ్ధిదారులకు రూ.6,00,696 విలువైన చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపిణీ చేశారు.

**సంక్షేమానికి అడ్డంకి కాదు అవినీతి**

ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి పథకాలు పూర్తిగా పారదర్శకంగా అమలవుతున్నాయని తెలిపారు. లబ్ధిదారులకు నేరుగా వారి ఇంటికే పథకాలు అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.గ్రామాలే అభివృద్ధికి పునాదికొత్తగా ఎన్నికైన సర్పంచులు అవినీతి, అక్రమాలకు దూరంగా ఉంటూ గ్రామాభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు చేయవచ్చని, అనంతరం గ్రామాల అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. అనవసర వివాదాలకు దూరంగా ఉండి పరస్పర గౌరవంతో ముందుకు సాగాలని హితవు పలికారు.
రెండు ఏళ్లలో సంక్షేమ విప్లవంరాష్ట్రంపై అప్పుల భారం ఉన్నప్పటికీ పేదలు, రైతులు, మహిళల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని కడియం శ్రీహరి తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని చెప్పారు.
గత పాలకుల హయాంలో నియోజకవర్గానికి చెడ్డ పేరు వచ్చిందని విమర్శించిన ఆయన, ఆ పరిస్థితిని తొలగించి అవినీతి రహిత సుపరిపాలన అందించడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరమని పిలుపునిచ్చారు.

# జోరుగా బీజేపీ ఎన్నికల ప్రచారం..

## గెలుపే లక్ష్యంగా ఇంటింటికీ మాజీ ఎమ్మెల్యే శ్రీధర్



**వర్ధన్నపేట/ఫిబ్రవరి5(జర్నలిస్ట్ వార్త);**
మునిసిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వర్ధన్నపేట 3వ వార్డులో బీజేపీ శ్రేణులు హోరెత్తించాయి. గురువారం నాడు 3వ వార్డు బీజేపీ బలపరిచిన అభ్యర్థి కొండేటి సత్యం విజయార్థం మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షులు కొండేటి శ్రీధర్ ఆధ్వర్యంలో ముమ్మర ప్రచారం నిర్వహించారు. డప్పు చప్పుళ్ళు, మంగళహారతులు, బొట్టు బోనాలతో అభ్యర్థికి మహిళలు ఘనస్వాగతం పలికారు.
ఈ సందర్భంగా కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసే సత్యంను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్, రాష్ట్ర నాయకులు డా. వన్నాల వెంకటరమణ, మల్లాడి తిరుపతి రెడ్డి, సోమిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు మైస రాము, నేతలు ముత్తిరెడ్డి కేశవ్ రెడ్డి, నాంపల్లి యాకయ్య, రాంరెడ్డి, పునుగోటి వెంకట్రావు, మహేందర్ పటేల్, మాదాసు రాజు తదితరులు పాల్గొన్నారు





## కమ్మరిపేటలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ చెరువు కాలువ పునరుద్ధరణ పనులకు శ్రీకారం

**వేలేరు/ఫిబ్రవరి5హనుమకొండ, బ్యూరో(జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లా వేలేరు మండలం కమ్మరిపేట గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద చేపట్టిన చెరువు కాలువ పునరుద్ధరణ పనులకు గురువారం ఘనంగా శ్రీకారం చుట్టారు. గ్రామాభివృద్ధి లక్ష్యంగా చేపట్టిన ఈ పనులు రైతాంగానికి దీర్ఘకాలికంగా ఉపయోగపడనున్నాయని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో వేలేరు మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షులు, కమ్మరిపేట గ్రామ సర్పంచ్ జోడుముంతల కిరణ్ ముఖ్య అతిథిగా పాల్గొని పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ‌గ్రామంలోని చెరువులు, కాలువల పునరుద్ధరణ వల్ల వర్షపు నీటి నిల్వ సామర్థ్యం పెరిగి భూగర్భ జలమట్టం మెరుగుపడుతుందని తెలిపారు.



దీంతో రైతులకు సాగునీటి కొరత తగ్గి వ్యవసాయ ఉత్పాదకత పెరుగుతుందని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధిలో ఉపాధి హామీ పథకం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.
ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా గ్రామంలో ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా ప్రజాపయోగకరమైన ఆస్తుల సృష్టి జరుగుతుందని ఆయన తెలిపారు. గ్రామానికి శాశ్వత ప్రయోజనం చేకూరేలా అన్ని అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చిల్పురి సూర్యనారాయణ మాట్లాడుతూ చెరువు కాలువల పునరుద్ధరణతో రైతులు, పశుపాలకులకు ప్రయోజనం కలుగుతుందని, గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ లావుద్య బిక్షపతి, గూటం రవీందర్, వెంకటయ్య, సాంబయ్య, రాజయ్యతో పాటు పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ కూలీలు పాల్గొని పనుల ప్రారంభంలో భాగస్వాములయ్యారు. గ్రామస్తులు ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తూ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేయాలని కోరారు.

# ముప్పారంలో మహాశివరాత్రి మహోత్సవాలకు ఘనంగా ఆరంభం

## ముఖ్యనాథస్వామి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ధర్మసాగర్ /ఫిబ్రవరి 5 హనుమకొండ బ్యూరో (జర్నలిస్ట్ వార్త);**ముప్పారం గ్రామంలోని పురాతన శ్రీ ముఖ్యనాథస్వామి దేవాలయంలో ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాలు2026కు సంబంధించి రూపొందించిన పోస్టర్‌ను స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి మండల కేంద్రంలో సోమవారం ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ముప్పారం గ్రామ సర్పంచ్ గుంటిపల్లి రేణుక వెంకట్ ఆధ్వర్యంలో శ్రీ ముఖ్యనాథస్వామి ఆలయ ట్రస్టు సభ్యులు ఎమ్మెల్యేను కలసి మహాశివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఉత్సవాల నిర్వహణ పట్ల భక్తుల పాల్గొనడం విశేషంగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామని, ఆలయ పరిపాలన కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు వివరించారు.ఉత్సవాల్లో భాగంగా 15వ తేదీ ఆదివారం ఉదయం 5 గంటల నుంచి రుద్రాభిషేకాలు, సాయంత్రం 6 గంటలకు శ్రీ ముఖ్యనాథస్వామి కళ్యాణ మహోత్సవం, రాత్రి 9 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.అదేవిధంగా 16వ తేదీ సోమవారం మహా అన్నదాన కార్యక్రమం, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాలు ఘనంగా జరగనున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుంటిపల్లి రేణుక వెంకట్, ఉపసర్పంచ్ తాళ్ళపల్లి కుమారస్వామి, ధర్మసాగర్ తహశీల్దార్ సదానందం, ఆర్ఐ అనిత, మాజీ ఎంపీటీసీ పెద్ది శ్రీనివాస్, ఆలయ పునర్వ్యవస్థాపక చైర్మన్ శివసాని ప్రవీణ్ రవీంద్ర, కమిటీ అధ్యక్షులు కొన్నే రవీందర్ రెడ్డి, కార్యదర్శి గుంటిపల్లి సంపత్ కుమార్, సులుగూరి రాజు, గ్రామ పెద్దలు చామల మహేందర్ రెడ్డి, గొనేల రాజయ్య, కోతి సాంబరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బొట్ల యాకయ్యకు నివాళులర్పించిన ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య

**పర్వతగిరి/ఫిబ్రవరి 5(జర్నలిస్ట్ వార్త);**పర్వతగిరిమండల కేంద్రానికి చెందిన బొట్ల యాకయ్య మరణించగా, గురువారం వర్ధన్నపేట ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య ఆయన అంతిమయాత్రలో పాల్గొని. యాకయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ పెద్దను కోల్పోయిన యాకయ్య కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే నాగరాజు అన్ని విధాలా అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి సర్పంచ్ చిదురు శంకర్, మాజీ ఎంపీటీసీ బొట్ల మహేంద్ర, మాజీ ఎంపీపీ రంగయ్య తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య



**భీమదేవరపల్లి/ఫిబ్రవరి5 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొత్తపల్లి కుమార్ (36) అనారోగ్య సమస్యల కారణంగా గురువారం తన వ్యవసాయ భూమిలో ఉన్న వేప చెట్టుకు ఉరి వేసుకుని ప్రాణాలు కోల్పోయాడు. ముల్కనూర్ ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం, కుమార్ గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ మానసిక ఒత్తిడికి లోనవ్వగా, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతుని తల్లి కొత్తపల్లి రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# చిన్నారిని ఆశీర్వదించిన జక్కంపూడి కిషోర్



**తల్లాడ/ఫిబ్రవరి 5 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండల పరిధిలోని కొత్త వెంకటగిరి గ్రామంలో దిరిశాల భద్రయ్య మనవరాలి ఓణీల (ఓణెల్ల) వేడుకను సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. ఈ శుభకార్యానికి తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కంపూడి కిషోర్ హాజరై చిన్నారిని అక్షింతలు వేసి ఆశీర్వదించారు.ఈ సందర్భంగా జక్కంపూడి కిషోర్ మాట్లాడుతూ చిన్నారికి ఆయురారోగ్యాలు, విద్యాబుద్ధి సమృద్ధిగా ఉండాలని ఆకాంక్షించారు. గ్రామీణ సంప్రదాయాలు, కుటుంబ విలువలను కాపాడే ఇలాంటి వేడుకలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దీవెల వెంకటేశ్వరావు, సామినేని రామప్పరావు, దీవెల కృష్ణయ్య, దిరిశాల వెంకట్రామయ్య, వెంకటేశ్వరావు, ఉప సర్పంచ్ రుద్రాక్ష రామకృష్ణ చారి తదితర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని చిన్నారికి శుభాకాంక్షలు తెలిపారు.
కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించిన ప్రజాప్రతినిధులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆసక్తికరం ప్రజల పత్రం · RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక



# దేవాదుల నీటికి గ్రీన్ సిగ్నల్

## ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చేతుల మీదుగా విడుదల

### మూడుచెక్కలపల్లి లింక్ మెయిన్ కెనాల్ ద్వారా 5 వేల ఎకరాలకు సాగునీరు



**నర్సంపేట/ఫిబ్రవరి 5 (జర్నలిస్ట్ వార్త):**రబీ సీజన్ పంటల అవసరాల దృష్ట్యా దేవాదుల ప్రాజెక్టు ఎత్తిపోతల పథకంలో భాగంగా నల్లబెల్లి మండలంలోని చెరువులను నింపేందుకు మూడుచెక్కలపల్లి లింక్ మెయిన్ కెనాల్ ద్వారా సాగునీటిని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి బుధవారం అధికారికంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరైతుల సాగు అవసరాలను దృష్టిలో ఉంచుకుని దేవాదుల నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. ఈ సాగునీటి ద్వారా సుమారు 5 వేల ఎకరాల వ్యవసాయ భూములకు లబ్ధి చేకూరనుందని వెల్లడించారు. రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. నల్లబెల్లి మండలంలోని చెరువులు నిండితే భూగర్భ జల మట్టం పెరిగి రైతాంగానికి దీర్ఘకాలిక ప్రయోజనం కలుగుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ కుమారస్వామి, సూపరింటెండింగ్ ఇంజనీర్ స్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లు నారాయణ, సుదర్శన్, డిప్యూటీ ఇంజనీర్ యశ్వంత్, అసిస్టెంట్ ఇంజనీర్‌లు తదితరులు పాల్గొన్నారు.

# అన్నారుగూడెం 12వ వార్డు మెంబర్ పొన్నం పద్మావతికృష్ణయ్య దంపతులకు ఘన సన్మానం




**తల్లాడ/ఫిబ్రవరి 5 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో 12వ వార్డు మెంబర్‌గా గెలుపొందిన పొన్నం పద్మావతి, కృష్ణయ్య దంపతులకు గురువారం మణుగూరులో ఘనంగా సన్మానం నిర్వహించారు.

ఈ సన్మాన కార్యక్రమంలో మణుగూరుకు చెందిన బంధువులు చెరుకుపల్లి వెంకటేశ్వర్లుసరస్వతి దంపతులు, మేనల్లుడు మండేపుడి కృష్ణార్జున్‌రజిత దంపతులు, చెరుకుపల్లి నరేష్‌అనూష దంపతులు శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. గ్రామంలో సంచలన విజయాన్ని సాధించడం గర్వకారణమని పేర్కొంటూ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పొన్నం పద్మావతికృష్ణయ్య దంపతులు తమకు ఇంతటి ఆదరణ కల్పించిన కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించేందుకు తమ వంతు కృషి చేస్తామని వారు హామీ ఇచ్చినట్లు పొన్నం కృష్ణయ్య తెలిపారు. అలాగే తమను విశ్వసించి గెలిపించిన 12వ వార్డు ప్రజలకు, అక్కాచెల్లెళ్లకు, అన్నదమ్ములకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

# విద్యా రంగంలో ఖమ్మం జిల్లాకు మరో కీర్తి

## ఐబిఓ అవార్డు షేక్ ఇస్మాయిల్‌కు



**కల్లూరు/ఫిబ్రవరి 5 (జర్నలిస్ట్ వార్త):** కల్లూరు మండల పరిధిలోని తెలంగాణ గ్రామర్ స్కూల్ ప్రిన్సిపల్ షేక్ ఇస్మాయిల్‌కు ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ బ్రిలియంట్ ఒలింపియాడ్ (ఐబిఓ) సంస్థ ఆధ్వర్యంలో 202526 విద్యా సంవత్సరానికి గాను జిల్లా స్థాయి 'ఐబిఓ ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు' లభించడం ఖమ్మం జిల్లా విద్యా రంగానికి గర్వకారణంగా నిలిచింది. ఈ అవార్డుకు ఎంపికైన సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ షేక్ ఇస్మాయిల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాలకు ఇంతటి గౌరవం తీసుకువచ్చినందుకు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూపిల్లలపై క్రమశిక్షణతో కూడిన ప్రత్యేక శ్రద్ధ, విద్యా ప్రమాణాల పెంపుకు సరికొత్త బోధనా పద్ధతుల అమలు, బోధనా సిబ్బందిలో నూతన ఆలోచనలను ప్రోత్సహించడం ద్వారా విద్యా రంగంలో ముందంజలో నిలిచామని తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రిన్సిపల్ షేక్ ఇస్మాయిల్ పాత్ర అమూల్యమైనదని కొనియాడారు. అవార్డు గ్రహీత షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూఈ గౌరవం పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల సమిష్టి సహకారం వల్లే సాధ్యమైందని తెలిపారు. భవిష్యత్తులో మరింత నాణ్యమైన విద్యను అందిస్తూ పాఠశాలను అభ్యున్నత దిశగా నడిపించేందుకు అంకితభావంతో కృషి చేస్తానని స్పష్టం చేశారు.

# మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

## ఎంపీడీవో శంకర్ నాయక్



**పర్వతగిరి/ఫిబ్రవరి 5 (జర్నలిస్ట్ వార్త);**మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీడీవో శంకర్ నాయక్ అన్నారు. పర్వతగిరి మండల కేంద్రంలో గురువారం మహిళా సంఘాల సహాయకులకు నిర్వహించిన వర్క్ షాప్‌లో ఎంపీడీవో శంకర్ నాయక్ పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పీఎం ఎఫ్ఎంఈ, లక్ పతి దీదీ వంటి పథకాలను మహిళలు అందిపుచ్చుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆయన కోరారు. స్వయం సహాయక బృందాల మహిళలు జీవనోపాధులను మెరుగుపరుచుకొని ఆస్తుల కల్పనపై దృష్టి సారించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీ రుణాలపై వీవోఏలు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనులకు కూలీలను ప్రోత్సహించడంతో పాటు, ఇందిరా మహిళా శక్తి, ఉపాధి భరోసా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వీవో భవనాల నిర్మాణానికి గ్రామ పంచాయతీ తీర్మానాలు ఇవ్వాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంలు రాజీర్, కిరణ్, మండల సమైక్య అధ్యక్షురాలు స్వప్న, సీసీలు, వీవోఏలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవాన గౌరవ డాక్టరేట్లు, అవార్డుల ప్రదానం

## చేయూతడేస్ప్రింగ్ యూనివర్సిటీ సంయుక్త కార్యక్రమం -సేవారంగంలో ప్రతిభావంతులకు ఘన సత్కారం




**శ్రీకాకుళం/ఫిబ్రవరి 5 (జర్నలిస్ట్ వార్త):** 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం జిల్లా కళింగ భవనంలో చేయూత సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్, డేస్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్లు, అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవారంగంలో విశేష కృషి చేసిన ప్రతిభావంతులకు గౌరవ డాక్టరేట్లు, సోషల్ సర్వీస్ అవార్డులను అందజేశారు.

ఈ సందర్భంగా పలువురు వక్తులు మాట్లాడుతూ, కరోనా సమయంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ తమ సేవలను ఎవరూ గుర్తించలేదని, మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న తమను చేయూత సంస్థ గుర్తించి అవార్డులతో సత్కరించటం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఇలాంటి గుర్తింపు తమలో మరింత సేవాభావాన్ని పెంచుతుందని తెలిపారు. చేయూత ఆర్గనైజేషన్ డైరెక్టర్ వై.ఎస్. చిన్నారావు మాట్లాడుతూ, చేయూత సంస్థ గత 20 సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. సమాజం గుర్తించలేని సేవకులను గుర్తించి, వారు వారి ప్రాంతాల్లో చేసిన సేవలను బట్టి గౌరవించడం మానవ ధర్మమని, మానవ సేవే మాధవ సేవ అన్న నినాదంతో సంస్థ ముందుకు సాగుతోందని వివరించారు.

డేస్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ప్రతినిధి డాక్టర్ ఆమోస్ జేమ్స్ మాట్లాడుతూ, గౌరవ డాక్టరేట్ అనేది అత్యంత ప్రాముఖ్యమైన హోదా అని, ఈ గౌరవం పొందాలంటే అనేక సేవా కార్యక్రమాలు చేసి ఉండాల్సి ఉంటుందని తెలిపారు. సుమారు 40 మంది దరఖాస్తు చేసుకోగా, కఠిన పరిశీలన అనంతరం కేవలం 11 మందికే గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమాన్ని జాతీయ జెండా ఆవిష్కరణతో ప్రారంభించి, జాతీయ గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అత్యంత ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ గురువుపల్లి దామోదరరావు, కో కన్వీనర్లు సూర స్వర్ణకుమారి, సుభాష్ శర్మ, జిల్లా కన్వీనర్ వరలక్ష్మి, గురుబిల్లి రామ్మోహన్‌రావు (ఏపీఎస్ఆర్టీసీ), బి. సూర్యరావు, బిషప్ జాషువా బిక్షపతి తిమోతిరాజు, రెవరెండ్ డాక్టర్ ప్రత్తిపాటి ప్రసాద్, ఏఎస్ఐ కామేశ్వరరావు, తలే లక్ష్మణ్‌రావు (అడ్వకేట్), సీనియర్ జర్నలిస్ట్ సూర్యారావు, మజ్జి గణపతి, సీఆర్పీఎఫ్ విజయనగరం జిల్లా కన్వీనర్ కె.వి. రమణమూర్తి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఒలింపియాడ్‌లో త్రివేణి స్కూల్ విద్యార్థినికి జిల్లా ప్రథమ స్థానం


## 33వ సుచిన్ ఇండియా సి.వి. రామన్ ఒలింపియాడ్‌లో యంగ్ జీనియస్ అవార్డు

## 9వ తరగతి విద్యార్థిని వై. కావ్య ఘన విజయం










**సత్తుపల్లి/ఫిబ్రవరి 5 (జర్నలిస్ట్ వార్త):** సుచిన్ ఇండియా సి.వి. రామన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన 33వ ఒలింపియాడ్ పరీక్షల్లో సత్తుపల్లి త్రివేణి స్కూల్, సత్తుపల్లి బ్రాంచ్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని వై. కావ్య జిల్లా ప్రథమ స్థానం సాధించి యంగ్ జీనియస్ అవార్డు అందుకోవడం విశేషంగా నిలిచింది. ఈ ప్రతిష్టాత్మక విజయాన్ని సాధించిన కావ్యను పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. సారిత, క్యాంపస్ ఇన్‌చార్జ్ వంశీ, అకాడెమిక్ ఇన్‌చార్జ్ పవన్ హృదయపూర్వకంగా అభినందించారు. పాఠశాల మేనేజ్‌మెంట్ డైరెక్టర్ జి. వీరేంద్ర చౌదరి, సీఆర్వో మురళీకృష్ణ కావ్యకు శుభాకాంక్షలు తెలియజేశారు.

కావ్య సాధించిన ఈ ఘన విజయంపై ఆమె తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ, పాఠశాల ఉపాధ్యాయుల నిరంతర ప్రోత్సాహం, మార్గదర్శకత్వమే ఈ ఫలితానికి ప్రధాన కారణమని తెలిపారు. భవిష్యత్తులో త్రివేణి స్కూల్ విద్యార్థులు ఇలాంటి ప్రతిభతో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని పాఠశాల యాజమాన్యం ఆకాంక్షించింది.

# కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ జన సమితి సంపూర్ణ మద్దతు

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలి : అంబటి శ్రీనివాస్



**నర్సంపేట/ఫిబ్రవరి 5 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ జన సమితి (టీజేఎస్) పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి శ్రీనివాస్ తెలిపారు. వరంగల్ జిల్లా తెలంగాణ జన సమితి పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి వరంగల్ జిల్లా అధ్యక్షులు షేక్ జావిద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూమున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాల్సిన బాధ్యత తెలంగాణ జన సమితి పార్టీ శ్రేణులపై ఉందని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్లే ప్రజల ఆగ్రహానికి గురైందని గుర్తు చేశారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారుల కుటుంబాలను పట్టించుకోకుండా కుటుంబ దోపిడీకి పాల్పడి లక్షల కోట్ల రూపాయలు దోచుకున్నారని తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడమే గత ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పిన కారణమని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేయాలని కోరారు. అలాగే స్థానిక సంస్థలు, మున్సిపాలిటీలకు అధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని, ఖచ్చితమైన ప్రణాళికలతో అన్ని పనులను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. టీజేఎస్ రాష్ట్ర కమిటీ తుది నిర్ణయం వరకు వరంగల్ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ జన సమితి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు స్పష్టం చేశారు. గత ప్రభుత్వ పాలనలో దగాపడ్డ తెలంగాణ అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో టీజేఎస్ రాష్ట్ర నాయకులు గుంటి రామచందర్, బోనగాని రవీందర్, సాయికుమార్, మహబూబ్ అలీ, సందాని గుర్తి సంజీవ, గిరిజాల రాజేష్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# టీజేఎంయూ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా ఎండీ ఫస్సిద్దిన్ ఎన్నిక







**ఖమ్మం బ్యూరో/ఫిబ్రవరి 5 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ జర్నలిస్టు మీడియా యూనియన్ (టీజేఎంయూ) వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షులు ఐ. ప్రభాకర్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కేంద్రంలోని మంచికంటి భవన్‌లో జెనరల్ బాడీ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో టీజేఎంయూ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా ఎండీ ఫస్సిద్దిన్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు, టీజేఎంయూ స్టేట్ లీగల్ అడ్వైజర్ గోరెంట్ల జానకి రామయ్య (ఎంఏ, ఎల్ఎల్‌బి) హాజరయ్యారు. ముందుగా అతిథులకు పుష్పగుచ్ఛాలు, శాలువాలతో రాష్ట్ర అధ్యక్షులు సత్కరించారు. ఈ సందర్భంగా నున్న నాగేశ్వరరావు మాట్లాడుతూస్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ప్రజల సమస్యలను అధికారులకు చేరవేయడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. అయితే నేటి పరిస్థితుల్లో జర్నలిజం స్వరూపం మారిపోయిందని, జర్నలిస్టులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా జర్నలిస్టుల సమస్యలపై సరైన దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇన్సూరెన్స్, అక్రెడిటేషన్ వంటి మౌలిక సమస్యలు పరిష్కారానికి తమ వంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. స్టేట్ లీగల్ అడ్వైజర్ గోరెంట్ల జానకి రామయ్య మాట్లాడుతూటీజేఎంయూ యూనియన్ సభ్యులకు ఏదైనా న్యాయపరమైన సమస్య ఎదురైతే పూర్తి స్థాయిలో అండగా ఉంటానని తెలిపారు. జర్నలిస్టుల పాత్ర సమాజానికి ఎంతో కీలకమైందని, ప్రజల సమస్యల కోసం నిరంతరం శ్రమించే వారికి ఎప్పుడైనా సహాయం అందిస్తానని చెప్పారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు ఐ. ప్రభాకర్ మాట్లాడుతూజర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా టీజేఎంయూ యూనియన్‌ను ఏర్పాటు చేశామని, రాష్ట్రవ్యాప్తంగా యూనియన్ బలోపేతానికి ప్రతి సభ్యుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టులకు ప్రభుత్వం నుండి రావలసిన అక్రెడిటేషన్, ఇళ్ల స్థలాలు, ఇన్సూరెన్స్ వంటి హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీజేఎంయూ స్టేట్ ఈసీ మెంబర్ సామల ప్రవీణ్, ఖమ్మం జిల్లా వైస్ ప్రెసిడెంట్ వెంకట్రాజు తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఉమ్మడి జిల్లా, భద్రాద్రి జిల్లా భద్రాచలం, బూర్గంపాడు, కారేపల్లి, తల్లాడ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన టీజేఎంయూ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చేతి గుర్తు పై ఓటువేసి మాలోతు దేవేందర్ నాయక్ ను అత్యాదిగా మెజార్టీ తో గెలిపించాలి.





**వర్ధన్నపేట/ఫిబ్రవరి5(జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి చేతి గుర్తు పై ఓటువేసి మాలోతు దేవేందర్ నాయక్ ను అత్యాదిగా మెజార్టీ తో గెలిపించాలని మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. గురువారం వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని డి.సి తండా 6వ వార్డు లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి మాలోతు దేవేందర్ నాయక్ మద్దతుగా మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు ఇంటింటి ప్రచారంలో పాల్గొని ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ప్రజా సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాలంటే చెయ్యి గుర్తుకు ఓటు వేయాలని మార్నేని రవీందర్ రావు కోరారు.వార్డు అభివృద్ధిలో వెనుకబడిన డి.సి తండాను దేవేందర్ నాయక్ నాయకత్వంలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.ప్రచారానికి వెళ్లిన నాయకులకు మహిళలు, యువత ఘన స్వాగతం పలికారు దేవేందర్ నాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించి కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని కార్యకర్తలు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 1వ వార్డులో ఇంటింట ప్రచారం..

### కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

### కాంగ్రెస్ సీనియర్ నాయకులు మన్నె బాబురావు





**వద్దన్నపేట/ఫిబ్రవరి5(జర్నలిస్ట్ వార్త):** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రచార పర్వం ముమ్మరమైంది. 1వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి బెజ్జం పాపారావు గెలుపు లక్ష్యంగా పార్టీ శ్రేణులు కదిలారు. కాంగ్రెస్ అభ్యర్థి బెజ్జం పాపారావు గురువారం ఒకటో వార్డులోని ప్రతి గల్లీలో తిరుగుతూ ఓటర్లను వ్యక్తిగతంగా కలుసుకున్నారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటూ ప్రచారాన్ని వేగవంతం చేశారు.ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మన్నె బాబురావు, అంకేశ్వర్ రామచంద్రరావు పాల్గొని అభ్యర్థికి మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా వారు వార్డు ప్రజలతో మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వార్డు అభివృద్ధి కోసం రూపొందించిన ప్రణాళికలను నాయకులు ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలంటే హస్తం గుర్తుకే ఓటు వేయాలని కోరారు.ప్రచారానికి వస్తున్న విశేష స్పందన చూస్తుంటే పాపారావు గెలుపు ఖాయమని నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

# మున్సిపల్ కౌన్సిలర్‌గా చిలక చిన్నకోటయ్యకు ఘన విజయం ఖాయం

### అత్యధిక మెజార్టీతో గెలిపించాలి- వార్డు ప్రజల ముక్తకంఠ నినాదం



**వైరా/ఫిబ్రవరి 5 (జర్నలిస్ట్ వార్త):**వైరా మున్సిపాలిటీలో జరుగుతున్న కౌన్సిలర్ ఎన్నికల్లో భాగంగా 8వ వార్డు నుంచి పోటీ చేస్తున్న టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి చిలక చిన్నకోటయ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వార్డు ప్రజలు ముక్తకంఠంతో కోరారు. ఈ అభ్యర్థికి తెలుగుదేశం పార్టీ, సీపీఐ, సీపీఎం పార్టీలు మద్దతు ప్రకటించాయి.ఈ సందర్భంగా మాట్లాడిన వార్డు నాయకులు, ప్రజలుడ గతంలో చిలక చిన్నకోటయ్య చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ, ఆయనను సేవాభావం కలిగిన వ్యక్తిగా కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండే నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు.తాను గెలుపొందితే మున్సిపల్ నిధుల నుంచి తమ వార్డుకు అత్యధిక నిధులు కేటాయింపజేయడంలో కీలక పాత్ర పోషిస్తానని చిలక చిన్నకోటయ్య ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం ప్రజల మధ్య ఉండి పనిచేస్తానని స్పష్టం చేశారు.అలాగే తమ పార్టీ తరఫున కట్టా స్వరూప రాణిని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నిక చేసుకోవడం ఖాయమైందని, అందువల్ల వార్డు అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఓటరును బంధుమిత్రుల ద్వారా ఉత్తేజపరిచి గెలుపులో భాగస్వాములుగా మారాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ, సీపీఐ, సీపీఎం, టీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ఎన్టీఆర్ విగ్రహానికి రూ.25 వేల విరాళం అందజేసిన టిడిపి జిల్లా నాయకులు వనమా వాసు



**ఖమ్మంబ్యూరో/ ఫిబ్రవరి 5 (జర్నలిస్ట్ వార్త)**


ఖమ్మం జిల్లా వేంసూరు; మండలం లచ్చనగూడెం గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు శ్రీ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) విగ్రహాన్ని భారీ వ్యయంతో ఏర్పాటు చేస్తున్నారు. లచ్చనగూడెం గ్రామ టిడిపి ఉపాధ్యక్షులు మోరంపూడి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి టిడిపి జిల్లా నాయకులు వనమా వాసు రూ.25 వేల విరాళాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వనమా వాసు మాట్లాడుతూ, సంక్షేమ పాలనకు ఆద్యుడు ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం ఎన్నో చారిత్రాత్మక పథకాలను ప్రవేశపెట్టిన మహానేత ఎన్టీఆర్ స్ఫూర్తితోనే నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు.

ఎన్టీఆర్ ఆశయాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి టిడిపి కార్యకర్తపై ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భీమదేవరపల్లిలో బెల్టుషాపుల రాజ్యం

### చట్టానికి సవాల్- పేదల జేబులు ఖాళీ!





**భీమదేవరపల్లి/ఫిబ్రవరి5 (జర్నలిస్ట్ వార్త):**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం అక్రమ మద్యం దందాకు అడ్డాగా మారింది. బెల్టుషాపుల పేరిట సాగుతున్న ఈ అక్రమ వ్యాపారం ఇప్పుడు వ్యవస్థనే ఎగతాళి చేస్తోంది. చట్టం ఉందా లేదా అన్న సందేహం కలిగేలా, అధికారుల నిశ్శబ్దం మధ్య పేదల జీవితాలతో నిర్లక్ష్యంగా చెలగాటం సాగుతోంది.

### మద్యం షాపులే దందాకు కేంద్రాలా?

ముల్కనూర్ గ్రామం అక్రమ మద్యం సరఫరాకు కేంద్ర బిందువుగా మారింది. మూడు మద్యం షాపులు ఉండగా, రెండు మాత్రమే అధికారికంగా తెరిచి ఉంచి అధికారులను మభ్యపెడుతున్నారన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. మూడో షాపు మాత్రం బెల్టుషాపులకు మద్యం తరలించే అక్రమ గోదాముగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి.

### గ్రామగ్రామాన మద్యం వరద

ముల్కనూర్ నుంచి కొప్పూరు, మాణిక్యాపూర్, వంగర, రత్నగిరి, రంగయ్యపల్లి, భీమదేవరపల్లి, గట్లనర్సింగాపూర్, రాంనగర్, కొత్తపల్లి తదితర గ్రామాలకు మద్యం సరఫరా అవుతోంది. ఎక్కడా తనిఖీలు లేవు. అడ్డుకట్ట లేదు. చట్టం నిద్రలో ఉంటే దందా మేల్కొనడం సహజమేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### సీసాపై రూ.60 నుంచి రూ.100 దోపిడీ పేదల చెమటపై బంగారం కరిగిస్తున్నారా?

ప్రభుత్వ ధరల మాటేమో గానీ, బెల్టుషాపుల్లో ఒక్కో సీసాపై అదనంగా రూ.40 నుంచి రూ.100 వరకు వసూలు చేస్తున్నారు. రోజువారీ కూలీలు, రైతులు ఈ దోపిడీకి బలవుతున్నారు. మద్యం మత్తులో కుటుంబాలు అప్పులపాలై, ఇంటి గడప దాటని దుఃఖాలు గ్రామాల్లో పేరుకుపోతున్నాయి.

### కూలిపోతున్న కుటుంబాలుడ కదలని వ్యవస్థ

బెల్టుషాపులు బహిరంగంగా నడుస్తున్నా, వాటిని అడ్డుకోవాల్సిన అధికారులు మాత్రం నోరు మెదపడం లేదు. ఈ మౌనం వెనుక ఏం ఉంది? ఎవరి రక్షణలో ఈ అక్రమ దందా సాగుతోంది? అన్న ప్రశ్నలు ప్రజల్లో ఉత్కంఠ రేపుతున్నాయి.

### మద్యం మత్తులో పెరుగుతున్న నేరాలు

అక్రమ మద్యం విక్రయాల వల్ల కుటుంబ కలహాలు, ఆర్థిక పతనం, నేరప్రవృత్తి పెరుగుతున్నాయి. గ్రామాల సామాజిక నిర్మాణం క్రమంగా కూలిపోతున్నా, బాధ్యత వహించాల్సిన వ్యవస్థ మాత్రం చేతులు దులుపుకుంటోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ఇకనైనా ఉక్కుపాదం మోపకపోతేడ ప్రజాగ్రహమే!


మండలవ్యాప్తంగా బెల్టుషాపులను మూసివేసి, అక్రమ మద్యం సరఫరా కేంద్రాలను పూర్తిగా నిర్మూలించాలని భీమదేవరపల్లి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే ప్రజాగ్రహం తప్పదని హెచ్చరిస్తున్నారు.

# కాంగ్రెస్ వన్ని నీతి మాటలు.. నీళ్ల మూటలు

### కాంగ్రెస్ నాయకులు కొత్తగా వేసిన శిలాఫలకాలు ఎక్కడైనా ఉన్నాయో...?

### రెడీమేడ్ రాజకీయం ఆపి అభివృద్ధిపై దృష్టి పెడితే మంచిది.

### ఆరూరి చేసిందే చెబుతాడు ..చెప్పిందే చేస్తాడు.. -టిఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి మిద్దపాక రవీందర్..



**వర్ధన్నపేట/ఫిబ్రవరి 5 (జర్నలిస్ట్ వార్త):**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి అనేది అటకెక్కిందని, వారు చెబుతున్నవన్నీ కేవలం నీతి మాటలు, నీళ్ళ మూటలేనని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మిద్దెపాక రవీందర్ ఘాటుగా విమర్శించారు. గురువారం వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గంలో నేడు అభివృద్ధి అనే మాటే వినిపించడం లేదని, కాంగ్రెస్ నాయకులు కొత్తగా వేసిన శిలాఫలకాలు ఎక్కడైనా ఉన్నాయా అని భూతద్దం పట్టుకుని వెతకాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. గత పదేళ్ల కాలంలో మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలిపారని, నేడు ఆ పనులనే కాంగ్రెస్ వారు తమ ఖాతాలో వేసుకోవాలని చూడటం హాస్యాస్పదమని అన్నారు. కాంగ్రెస్ నాయకులు చేస్తున్న రెడీమేడ్ రాజకీయం ఆపాలని, చేతనైతే కొత్త నిధులు తెచ్చి కొత్త పనులు ప్రారంభించాలని సవాల్ విసిరారు. అరూరి రమేష్ అంటే ఒక నమ్మకమని, ఆయన చేసిందే ప్రజలకు చెబుతారని, చెప్పిన ప్రతి మాటను క్షేత్రస్థాయిలో అమలు చేసి చూపిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన చేసిన అభివృద్ధి పనులు ప్రతి గ్రామంలో, ప్రతి గడపకూ కళ్ళముందు కనిపిస్తున్నాయని, వాటిని చెరిపివేయడం ఎవరి తరమూ కాదని స్పష్టం చేశారు. నీటి మీద రాతలు రాసి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్న కాంగ్రెస్ నాయకులు, నిలువుటద్దం లాంటి నిజాన్ని దాచలేరని మండిపడ్డారు. అరూరి రమేష్ చేసిన అభివృద్ధి నోసుటిపై గీతలలాటివని, చరిత్రను ఎవరూ తుడిచివేయలేరని అన్నారు. అబద్ధపు హామీలతో, మోసపూరిత మాటలతో ప్రజలను కొన్నాళ్ళు నమ్మించవచ్చేమో కానీ, ఎల్లకాలం అది సాధ్యం కాదని రవీందర్ హెచ్చరించారు. వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, త్వరలోనే ఈ రెడీమేడ్ రాజకీయాలకు చరమగీతం పాడుతారని ధీమా వ్యక్తం చేశారు. కేవలం ప్రచారానికే పరిమితమైన కాంగ్రెస్ నాయకులు, ఇప్పటికైనా విమర్శలు మానుకుని ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయడంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. అరూరి రమేష్ వేసిన పునాదులపైనే నేడు నియోజకవర్గం నిలబడి ఉందని, ఆయన నాయకత్వంలోనే మళ్ళీ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో ఇప్పటికీ పాత కొత్త నాయకుల మధ్య విభేదాలు అలానే ఉన్నాయని. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి. ఎమ్మెల్యే నాగరాజు అధికారంలోకి రావడానికి తనకోసం అహర్నిశలు కృషి చేసిన నాయకులను సైతం మరిచిపోయిన సంగతి తాను మళ్ళీ ఒకసారి గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అవతలి వ్యక్తులపై బురదజల్లే రాజకీయం మానుకొని నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం దృష్టి సారించి. నీతి నిజాయితీగల రాజకీయం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేస్తారు.ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# అరూరి అడ్రస్ గల్లంతు కావడం ఖాయం

### కాంగ్రెస్ యువజన నాయకులు కుల్ల యాకాంతం



**వర్ధన్నపేట/ఫిబ్రవరి5(జర్నలిస్ట్ వార్త):**

అడ్డగోలు మాటలతో ప్రజలను మభ్యపెడుతున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు రాజకీయ భవిష్యత్తు లేదని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఆయన అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని వర్ధన్నపేట యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కుల్ల యాకాంతం హెచ్చరించారు. గత పదేళ్ల అధికారంలో అక్రమ సంపాదన, కాంట్రాక్టులపై ఉన్న శ్రద్ధ ప్రజల సంక్షేమంపై లేదని, అందుకే సొంత పార్టీ కార్యకర్తలే ఆయనను ఓడించి బుద్ధి చెప్పారని ఎద్దేవా చేశారు. లక్ష మెజారిటీ అని గొప్పలు చెప్పుకున్న అరూరిని ప్రజలు ఇంటికి పరిమితం చేసినా ఆయన తీరు మారలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఏ గ్రామంలోనూ పేదలకు ఒక్క ఇల్లు కూడా కట్టని చరిత్ర అరూరిదని, నేడు నియోజకవర్గంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను చూసి ఓర్వలేక విషప్రచారం చేస్తున్నారని విమర్శించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, నియోజకవర్గ అభివృద్ధిని కాంక్షిస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక అరూరి రమేష్ అర్థరహితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పార్టీ కార్యకర్తలను, ఉద్యమకారులను గాలికొదిలేసి కేవలం స్వార్థ రాజకీయాల కోసం బీఆర్ఎస్ పెద్దల మెప్పు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. బిజెపిలో చేరి అక్కడ ఆదరణ లేక తిరిగి బీఆర్ఎస్‌లోకి వచ్చిన అరూరిది అవకాశవాద రాజకీయమని యాకాంతం విమర్శించారు. వర్ధన్నపేట మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం తథ్యమని, అరూరి ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని స్పష్టం చేశారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకొని అడ్డగోలు మాటలు కట్టిపెట్టకపోతే, మున్సిపల్ ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని ఆయన హెచ్చరించారు.

# చైర్మన్ పీఠంపైనే ప్రధాన పార్టీల కన్ను..

### హోరాహోరీగా అభ్యర్థుల వ్యూహప్రతివ్యూహాలు



**వర్ధన్నపేట/ఫిబ్రవరి 5(జర్నలిస్ట్ వార్త):**

మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో వర్ధన్నపేటలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఫిబ్రవరి 11న జరగబోయే పోలింగ్ కోసం ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపిలు మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు తమ వ్యూహాలకు పదును పెడుతుండటంతో ఈసారి ఎన్నికల ముఖచిత్రం గతానికి భిన్నంగా కనిపిస్తోంది. ముఖ్యంగా చైర్మన్ పదవిని దక్కించుకోవడం కోసం అభ్యర్థులు తమ రాజకీయ భవిష్యత్తును పణంగా పెట్టి రంగంలోకి దిగుతున్నారు. మున్సిపాలిటీలోని కీలక వార్డుల్లో అభ్యర్థులు గల్లీ గల్లీ తిరుగుతూ ఓటర్ల నాడి పట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, ఈ ఎన్నికల్లో ఒక వింత ధోరణి అభ్యర్థులను ఆందోళనకు గురి చేస్తోంది. ఉదయం ఒక పార్టీ కండువాతో ప్రచారం చేసిన కార్యకర్తలు, సాయంత్రానికి మరో పార్టీ తరఫున కనిపిస్తుండటంతో నమ్మిన వారెవరో, ప్రత్యర్థుల కోసం పనిచేసే వారెవరో తెలియక అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. మరోవైపు ఓటర్ల నుంచి వస్తున్న డిమాండ్లు అభ్యర్థులకు చుక్కలు చూపిస్తున్నాయి. చైర్మన్ పీఠం లక్ష్యంగా అభ్యర్థులు ఎంతటి త్యాగానికైనా సిద్ధపడుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి అగ్నిపరీక్షలా మారింది. పరువు కోసం పడరాని పాట్లు పడుతూ ప్రచార పర్వంలో ముందుకు సాగుతున్న నాయకులు, ప్రత్యర్థుల వ్యూహాలను చిత్తు చేసేందుకు శ్రమిస్తున్నారు. ఫలితాల కోసం సర్వత్రా ఉత్కంఠ నెలకొనగా, వర్ధన్నపేట మున్సిపాలిటీ భవిష్యత్తు ఇప్పుడు ఓటర్ల చేతుల్లోనే ఉంది.